క్లుప్తంగా

జిల్లా కేంద్రంలో నిర్మించాలి

గద్వాల అర్బన్: మండల పరిధిలోని అనంత పురం గుట్టల వెనుక నిర్మానుష్య ప్రాంతంలో కోర్టు సముదాయ భవనాల నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర ప్రభాకర్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కక్షి దారులకు, కోర్టు వచ్చే ప్రజలకు సౌకర్యవంత మైన గద్వాల పట్టణంలోనే కోర్టు సముదాయాన్ని నిర్మించాలన్నారు. కలెక్టరేట్ ఆవర ణలో 12 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం



అయిజ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు తొలి రోజు ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 14,330 మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ



అయిజ: మండల కేంద్రంలో చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత నెల 21న అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన మేరకు 350 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లుక్ జాన్సన్, రత్నాకర్, సుజిత్, జయన్న, భాస్కర్, మహేష్, సాలమాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు



అయిజ: మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మీడియా ద్వారా ప్రజాదరణ పొందిన మోహన్‌బాబు మీడియా ప్రతినిధులపై దాడిచేయడం శోచనీయమని విమర్శించారు. మీడియా ప్రతినిధులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భగవద్గీత జయంతి వేడుకలు

శాంతినగర్ : భగవద్గీత జయంతి వేడుకలు వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా హిందూ పంచాంగం ప్రకారం మార్గశిర శుద్ధ ఏకాదశిని భగవద్గీత జయంతి జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మానవ జాతికి దివ్య మార్గాన్ని చూపే పవిత్ర గ్రంథమని కొనియాడారు. కార్యక్రమంలో శేఖర్, గోపాల్, ఆంజనేయులుగౌడ్, అంజి, దామోదర్, వెంకటేష్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్.. ఇద్దరికి గాయాలు

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామ శివారులోని ప్రధాన మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కొప్పునూరుకు చెందిన ఎల్లస్వామి, సందీప్ బైక్‌పై పెద్దదగడ నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపు తప్పి బైక్ కింద పడింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. బాధితులను స్థానికులు కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెత్త నిర్వహణపై నిర్లక్ష్యం

- రోడ్లపైనే చెత్త కాల్చివేత
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడు డంపింగ్ యార్డులో చెత్త తగులబెడుతున్న దృశ్యం(ఫైల్)

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను పారిశుధ్య కోరల నుంచి రక్షించడానికి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాలు ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ తెలంగాణ లక్ష్యంతో పని చేయాలని విధివిధానాలు కూడా రూపొందించారు. అయితే కింది స్థాయిలో అవి అమలు కావడం లేదు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ కూడా తూతూ మంత్రంగానే జరుగుతుందని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త సేకరణకు వీధుల్లోకి ట్రాక్టర్లు సైతం రావడం లేదని పేర్కొంటున్నారు. చెత్త నుంచి సంపద తదితర లక్ష్యాలకు కింది స్థాయి సిబ్బంది బహుదూరం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడి గ్రామాల స్వచ్ఛతాహీ లక్ష్యం కనుమరుగైంది. రోడ్లపై, ఎక్కడిబడితే అక్కడ చెత్త కాల్చివేసి గ్రామాల్లోని ప్రజలు వ్యాధులు బారిన పడేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పనిభారం తగ్గించుకునేందుకు దహనం..

గ్రామాల్లో రోజు వారీగా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉంది. ఏ రోజు ఎన్ని ట్రిప్పుల చెత్త సేకరించారనే వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. సేకరించిన చెత్త నుంచి పొడి చెత్తగా గుర్తించిన ఇనుము, ప్లాస్టిక్, గాజు తదితర వస్తువులను విక్రయించేందుకు సిద్ధంగా ఉంచాలి. తడి చెత్త ద్వారా తయారయ్యే వర్మీ కంపోస్ట్ విక్రయం ద్వారా రెండు విధాలుగా వచ్చే ఆదాయాన్ని ఎలా వినియోగించుకోవచ్చు. ఈ విధానం ద్వారా ఎందరికి ఉపాధి కలిపించవచ్చనే విధి విధానాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. ఇదంతా నిర్వహించడం భారమవుతుందనే ఆలోచనలతో అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా డంపింగ్ యార్డులోనూ, రోడ్లపైనా, వీధుల్లో పంచాయతీ సిబ్బంది చెత్త కాల్చివేస్తున్నారు. అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరు గారడమే కాకుండా ప్రజాధనం వృథా అవుతుందని వాపోతున్నారు.



చంద్రశేఖర్‌నగర్‌లో రోడ్డు పక్కనే చెత్త కాలుస్తున్న దృశ్యం(ఫైల్)

చర్యలు తీసుకుంటాం..

మండలంలోని ఏఏ గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లో, రోడ్లపైన, గ్రామాల్లోని వీధుల గుండా చెత్త కాలుస్తున్నారో వారిపై చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులకు సమావేశలు ఏర్పాటు చేసి ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యల తీసుకోవాలని సూచిస్తాం.

-భాస్కర్ ఎంపీడీఓ మానవపాడు



మానవపాడులో చెత్త కాలుస్తున్న దృశ్యం(ఫైల్)

తల్లిదండ్రుల సహకారం అవసరం



అయిజలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రాములు

అయిజ: పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తల్లిదండ్రుల సహకారం అవసరమని ప్రిన్సిపాల్‌రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 90 రోజుల ప్రణాళికలో భాగంగా కళాశాల అధ్యాపకులు రివిజన్‌తో ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీని కోసం విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం..

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు వారి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. 90 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు బోధనలో మెళకువలు సూచించారు. విద్యార్థులకు ప్రశ్న పత్రాల విధానంపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివితేనే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



రామకృష్ణకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: డిసెంబర్ 22న నిర్వహించే టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గోవర్ధన్, సత్యం కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభలో తీర్మానాలు రూపొందిస్తామని తెలిపారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్‌లో లైన్‌మెన్ రామకృష్ణకు కడువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమానికి ఎండీ మస్తాన్, బాలరాజు, ఆనంద్‌గౌడ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'ఆల' చేసింది ఏమిలేదు



మాట్లాడుతున్న పల్లెపాగ ప్రశాంత్

కొత్తకోట: మండల అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసింది ఏంలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉండి కొత్తకోటకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. కొత్తకోట పట్టణంలో నెలకు రూ.యాభై వేలు వచ్చే ప్రభుత్వ భవనాన్ని ఎందుకు ఆకస్మికంగా ఖాళీ చేసి కూల్చేశారో ప్రజలకు తెలుసన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన జి.మధుసూదన్‌రెడ్డి ఏడాదిలోనే పట్టణ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక అసత్యాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమంతో పాటు ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నగరపు బీచుపల్లి, పట్టణ అధ్యక్షుడు పోతులపల్లి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, చర్లపల్లి శేఖర్‌రెడ్డి, ఎంజే బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణోదయ 50 వసంతాల కరపత్రాల విడుదల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: అరుణోదయ 50 వసంతాల కరపత్రాలను ఎస్ఎన్ శంకరన్ పార్కులో బుధవారం ఆ సంఘ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి జనజ్వాల మాట్లాడుతూ జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో 1974లో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా అరుణోదయ పురుడు పోసుకుందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు విప్లవ ఉద్యమంలో ఆట, పాట, మాటల ద్వారా ప్రజల్లోకి వెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారాని కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. 2024 నాటికి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కవి, గాయని విమల ఆధ్వర్యంలో వేడుకలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరపనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యేసుపు, ఉద్యోగ సంఘం నాయకులు ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

వీపనగండ్ల: మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డి కృష్ణయ్య ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా బతుకన్న, అధ్యక్షుడిగా రాంచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, రోహిణి, ప్రధాన కార్యదర్శిగా బి స్వామి, కోశాధికారిగా దేవేందర్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, రంజిత్, శ్రీలత, రాములు, గోవిందునాయక్, వనిత, రవి, సుష్మిత ఎంపికయ్యారు.

వైభవంగా నల్లారెడ్డి జాతర

మల్దకల్ : మండలంలోని పాల్వాయి గ్రామంలో చింతలాముని నల్లారెడ్డి స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ అధికారులు జాతర సందర్భంగా గ్రామానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో జరిగే స్వామి వారి ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, నాయకులు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు కార్యక్రమానికి ఆహ్వానం

అయిజ: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి క్రీడా అభిమానులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

జిల్లాస్థాయి కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని సంగాల పార్కు వద్ద బుధవారం రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా స్థాయి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన షేక్ బషీర్ అహ్మద్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకోగా.. నూతన జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ బషీర్ అహ్మద్, అసోషియేషన్ అధ్యక్షుడిగా షేక్ నదీమ్, ఉపాధ్యక్షులుగా జహురుద్దీన్, మహ్మద్ ఖాజా పాష, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ రఫీ, మహ్మద్ మస్తాన్ వలి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా షేక్షావలి, రిజ్వానతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి భీమన్న, జిల్లా అధ్యక్షుడు నాగార్జున్ గౌడ్, కోశాధికారి విష్ణు, మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎమ్ఓ బాలామణి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి డీఎంఓ బాలామణి పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 36 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు సిబ్బంది తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. అనంతరం రైతుల టోకెన్లు పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రటరీలు నరసింహులు, ఎల్లస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాగదోనలో నిలిచిన మధ్యాహ్న భోజనం

గట్టు : మండల పరిధిలోని చాగదోన ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిపేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రాథమిక పాఠశాలలో మొత్తం 195 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వంట ఏజెన్సీ రావడం లేదని ముందుగానే చెప్పడంతో కొంత మంది విద్యార్థులు ఇండ్ల నుంచి బాక్సులు తెచ్చుకోగా మరికొందరు తీసుకురాలేదు. గురువారం కూడా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేది అనుమానంగా ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై హెచ్ఎం అయ్యస్వామిని వివరణ కోరగా వంట ఏజెన్సీ వారు రావడం లేదని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, కనీసం ఒక్కరూ వచ్చినా సర్దుకుపోతామని చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. దీంతో మధ్యాహ్న భోజనం అందించలేక పోయినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



11వ వార్డులో పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

అయిజ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. బుధవారం అధికారులతో కలిసి 1, 11వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు తదితర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర రంగన్న, వాటర్ లైన్‌మెన్ నరసింహులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దళిత హక్కుల కోసం పోరాటం



డీహెచ్‌పీఎస్ నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

అమరచింత: ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి తోడ్పాటు అందించడం లేదని, దళిత హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మసప్ప, రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో అమరచింత పట్టణ నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఆర్థిక, రాజకీయ, సామాజిక, హక్కుల పరిరక్షణ, కుల వివక్షను వ్యతిరేకిస్తూ కలిసి కట్టుగా ఉద్యమాలు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కమిటీ పట్టణ అధ్యక్షుడిగా రాంచందర్, ఉపాధ్యక్షులుగా రాజేష్, దాసు, కార్యదర్శిగా దినకుమార్, సహకార్యదర్శిగా ఇజ్రాయిల్, కోశాధికారిగా సౌలుతో పాటు పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఇటిక్యాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

ఇటిక్యాల : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహినద్దీన్, తహసీల్దార్ నరేందర్, ఎంఈఓ అమీర్ పాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలు..

అలంపూర్: సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని మాంటేశ్వరి పాఠశాలలో సీఎం కప్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ మంజుల, ఎంఈఓ అశోక్, నాయకులు గోపాల్, రాము, జగన్మోహన్ నాయుడు, నర్సన్ గౌడు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సాహం..

కేటీదొడ్డి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిధిలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్ల హనుమంతు హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు..

మానవపాడు: మండల కేంద్రంలో గురువారం నుంచి మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయికి ఎంపిక జరుగుతుందన్నారు. క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ప్రారంభమైన క్రీడా పోటీలు..

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీఓ రామకృష్ణ ప్రారంభించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహ, తహసీల్దార్ ప్రభాకర్, ఆయా పాఠశాలల పీఈటీ, పీడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో క్రీడాకారులతో నాయకులు, ఉపాధ్యాయులు



కొంకలలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు



నందిన్నెలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు, అధికారులు



అలంపూర్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీడీఓ పద్మావతి